
ధరూర్ మండలంలో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండ్ల

- ఆలోచించి ఓటు వేయాలి
- స్కాంల పార్టీకి స్కీంలపై మాట్లాడే అర్హత ఉందా?
- బహుజనులను పాలనలో భాగస్వాములను చేసింది బీఆర్‌ఎస్సే
- ఇంటిదొంగలకు నీళ్లివ్వండి కానీ.. మాట వినొద్దు
- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# ఆగం కావొద్దు..

ధరూర్, నవంబర్ 11 : ''బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో గద్వాల నియోజకవర్గం అభివృద్ధిలో ఉంది. అందులోనే కొనసాగుదాం. అడ్డమైన నాయకులు చెప్పే మాయమాటలకు మోసపోయి ఆగం కావొద్దు..'' అని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ధరూరు మండలంలో ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటువేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. చిన్నపాడు, పాల్‌చర్ల, సోంపురం, మన్నాపురం, గుర్రోనిపల్లి, దోర్నాల, ఓబులోనిపల్లి, ర్యాలంపాడు, మార్లబీడు, చెన్నారెడ్డిపల్లి, బూరెడ్డిపల్లి, ధరూరు గ్రామాల్లో ఎమ్మెల్యే ప్రచారం నిర్వహించగా పల్లెపల్లెనా యువకులు బైక్ ర్యాలీలు, గులాబీ జెండాలతో స్వాగతం పలుకగా మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రజల చెంతకు వెళ్లి కారుకు ఓటేద్దాం, కేసీఆర్‌ను గెలిపిద్దాం, సంక్షేమంలో నడుద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పథకాలను ప్రజల చెంతకు చేర్చిన నాయకుడిని మరువొద్దని సూచించారు. మనకోసం ఎన్నో చేస్తున్న ప్రభుత్వానికి అండగా నిలుస్తారా అని ప్రశ్నించగా మేమంతా మీవెంటేనని ప్రజలు మద్దతు తెలిపారు. అరవై ఏండ్ల పాలనలో స్కాంలు చేసిన కాంగ్రెస్ పార్టీకి మన స్కీంలపై మాట్లాడే హక్కు లేదన్నారు. బహుజనుల అభివృద్ధికి పాటుపడేది బీఆర్‌ఎస్ పార్టీ అని తేల్చి చెప్పారు. గద్వాలలోనే వాల్మీకి బోయను కన్జ్యూమర్ ఫోరం చైర్మన్‌ను చేశాం.. కల్లుగీత బిడ్డను సాట్ చైర్మన్ చేశాం.. దళిత బిడ్డను పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్‌ను చేసుకున్నాం.. ప్రస్తుత కాంగ్రెస్ నాయకురాలు గతంలో ఏ పార్టీ అండతో జెడ్పీ చైర్‌పర్సన్ అయ్యిందో ప్రజలే గుర్తించాలన్నారు. ధరణితో భూమిపై మనకు ధీమానిచ్చింది సీఎం కేసీఆరేనని వివరించారు. ప్రతి గుంటకూ నీళ్లిచ్చి.. 24 గంటల కరెంట్ ఇచ్చి, రైతుబంధు, రైతుబీమా ఇస్తున్న సర్కారును ప్రజలంతా ఆదరించాలని కోరారు. తెలంగాణలో పుట్టడం పూర్వజన్మ సుకృతంగా ప్రజలు భావిస్తున్నారన్నారు. గర్భిణుల కోసం పల్లె దవాఖానలు, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్, అంగన్‌వాడీ సెంటర్ ద్వారా ప్రతి రోజూ పాలు, గుడ్డు, పప్పు అందిస్తూ ఆరోగ్యమైన భవిష్యత్ తరానికి ఆహ్వానం పలుకుతున్నదన్నారు. మండల అభివృద్ధికి ఇప్పటివరకు రూ.312,28,42,745 ఖర్చు చేశామన్నారు. అదేవిధంగా బీఆర్‌ఎస్ మండల కార్యకర్తల బీమా కోసం వ్యక్తి గతంగా రూ.8లక్షలు ఖర్చు చేశామన్నారు. పల్లెల్లోకి వచ్చే ఇంటి దొంగలకు నీళ్లిచ్చి పంపాలని, వారి మాటలు వినొద్దని సూచించారు. ''మీరు ఆగమై మమ్మల్ని ఆగం చేయొద్దు..'' అని వారికి ముక్కు సూటిగా చెప్పి తిప్పి పంపాలన్నారు. తనను గెలిపించి కేసీఆర్‌కు గిఫ్ట్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు నాగర్‌దొడ్డి వెంకట్రాములు, పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజారెడ్డి, కుర్వ శ్రీనివాసులు, అబ్రహం, వెంకటేశ్‌నాయుడు, రామన్న, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, మార్కెట్ డైరెక్టర్ నర్సింహులు, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, రాఘువేందర్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, విజయ్, సాగర్, శ్రీధర్, రాములు, యూత్ మండల నాయకులు పురుషోత్తంరెడ్డి, చక్రధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మన్నాపురంలో ఎమ్మెల్యే ప్రసంగాన్ని వింటున్న గ్రామస్తులు

## ఆదరించండి..
# అభివృద్ధి చేస్తా

- సబ్బండ వర్గాల అభ్యున్నతే బీఆర్‌ఎస్ ధ్యేయం
- అలంపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు
- అయిజ మండలంలో విస్తృత ప్రచారం
- ఘన స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు, ప్రజలు

కుటుకనూర్‌లో నిర్వహించిన ప్రచారంలో విజయుడికి మద్దతుగా పాల్గొన్న ప్రజానీకం



అయిజ, నవంబర్ 11 : తెలంగాణ సర్కారు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కాంక్షించి బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తే అలంపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడు అన్నారు. శనివారం మండలంలోని సింధనూర్, కుటుకనూర్, కొత్తపల్లి, తొత్తినోనిదొడ్డి, మూగోనిపల్లి, భూంపురం, ఉత్తనూర్ గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా విజయుడు మాట్లాడుతూ తొమ్మిదిన్నరేండ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను తెలంగాణలో అమలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. వచ్చే ఐదేళ్లలో ఆసరా పింఛన్లను రూ.5వేలకు పెంచడంతోపాటు రేషన్‌కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ సన్నబియ్యం పంపిణీ చేసేలా మ్యానిఫెస్టోలో పొందుపర్చామన్నారు. తుమ్మిళ్ల ఎత్తిపోతలలో భాగంగా ఫేజ్-2లో మల్లమ్మకుంట, వల్లూరు, జులెకల్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆర్డీఎస్ ఆయకట్టు పరిధిలోని పంటలకు సాగునీరు పుష్కలంగా అందించేందుకు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సీఎం కేసీఆర్‌తో సుదీర్ఘంగా చర్చించి టీబీ డ్యాం ద్వారా నీటిని విడుదల చేయించారని గుర్తు చేశారు. అయిజ మండలంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను ఎన్నికలు పూర్తికాగానే పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయాలని కోరారు. అనంతరం ఉత్తనూర్‌లోని ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో విజయుడు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు అభ్యర్థిని శేషవస్త్రంతో సత్కరించి ఆశీర్వదించారు. అదేవిధంగా భూంపురంలో వాల్మీకి విగ్రహానికి, ఉత్తనూర్‌లో అంబేద్కర్, సుభాష్ చంద్రబోస్, దివగంత పులకుర్తి తిరుమల్‌రెడ్డి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా విజయుడికి పల్లెపల్లెనా ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, బీఆర్‌ఎస్ సర్పంచులు, ఎంపీటీసీలు, విండో డైరెక్టర్లు, బీఆర్‌ఎస్ శ్రేణులు పాల్గొన్నారు.

# రిజర్వాయర్లను పూర్తి చేస్తాం

- రైతుల సాగునీటి కష్టాలు తీర్చుతాం..
- అండగా ఉంటాం.. ఆదరించండి
- బెదిరింపులు, వసూళ్ల రాజాలను వదిలిపెట్టం
- బీఆర్‌ఎస్ గెలుపునకు కలిసికట్టుగా కృషిచేద్దాం: ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- శాంతినగర్, అయిజలో ముఖ్యకార్యకర్తల సమావేశం
- వందలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు

వడ్డేపల్లి, నవంబర్ 11 : బీఆర్‌ఎస్ పార్టీని ఆదరిస్తే రైతులకు అండగా నిలబడి రిజర్వాయర్లను పూర్తిచేసే బాధ్యత తీసుకుంటామని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కార్యకర్తలు, రైతులకు హామీ ఇచ్చారు. శాంతినగర్‌లో మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు నివాసంలో శనివారం వడ్డేపల్లి, రాజోళి మండలాలకు చెందిన వందలాది కార్యకర్తలతో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగాఎమ్మెల్సీ హాజరై మాట్లాడారు. ఎలాంటి విభేదాలు లేకుండా కలిసికట్టుగా బీఆర్‌ఎస్ విజయానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అలంపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని గెలుపించుకొని వస్తానని సీఎం కేసీఆర్‌కు మాట ఇచ్చానని, మీరు ఆశీర్వదిస్తే రిజర్వాయర్లు పూర్తి చేయించి సాగునీటి గోస తీర్చుతామన్నారు. చిన్నోనిపల్లి రిజర్వాయర్ పూర్తయిన అనంతరం ఆర్డీఎస్ కెనాల్‌కు లింక్ కలుపుతామన్నారు. మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్ మాట్లాడుతూ గతంలో తన జెడ్పీ చైర్మన్ ఎంపిక విషయంలో చల్లా సహాయ పడ్డాడని, ఆయన పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నాడని వివరించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పథకాలు బాగున్నాయి.. మచ్చలేని నాయకుడిగా చల్లాకు పేరుంది.. చల్లా నాయకత్వంలో పార్టీ గెలుపునకు కృషి చేసి మన ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుందాం'' అని కార్యకర్తలకు పిలుపునిచ్చా రు. అనంతరం కార్యకర్తలు చల్లా, వడ్డేపల్లి శ్రీనివాసులును గజమాలతో సన్మానించారు. అలంపూర్ అడ్డా.. చల్లా అడ్డా, వడ్డేపల్లి గడ్డ.. శ్రీనివాసులు అడ్డా అని నినదిస్తూ సభాప్రాంగణాన్ని హో రెత్తించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌గౌడ్, కౌన్సిలర్ అజయ్‌కుమార్, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ఆంజనేయులుగౌడ్, ఆలయకమిటీ చైర్మన్ బోయ చిన్నయ్య, నాయకులు గోపాల్, నారాయణ, కుర్వ సోమన్న, కిశోర్, వెంకటేశ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

### మరో కోనసీమ చేస్తాం

మానవపాడు, నవంబర్ 11 : ఆర్డీఎస్, తుమ్మిళ్ల, నెట్టెంపాడ్, జూరాల లింక్ కాల్వ, చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి సమాంతర కాల్వల ద్వారా సాగునీరు అందించి అలంపూర్‌ను మరో కోనసీమగా మార్చుతామని ఎమ్మెల్సీ చల్లా స్పష్టం చేశారు. శనివారం మండలం మీదుగా వెళ్తున్న ఎమ్మెల్సీకి కొర్విపాడు స్టేజీలో సర్పంచ్ శ్రీనివాసులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలొచ్చి పూలమాలలు వేసి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయిన ఏడాదిలోగా చిన్నోనిపల్లె రిజర్వాయర్ నుంచి సమాంతర కాల్వ తీసుకొచ్చి ఆర్డీఎస్ కాల్వలో కలిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. నెట్టెంపాడ్ 99, 100 ప్యాకేజీల్లో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేసి అక్కడి నుంచి కూడా సాగునీరు అందిస్తామన్నారు.


### భారీ మెజార్టీతో గెలిపించండి

అయిజ, నవంబర్ 11 : సీఎం కేసీఆర్ ఆలోచనలకు దీటుగా అలంపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి విజయుడిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి కోరారు. శనివారం పట్టణంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేతలు, ఎమ్మెల్యే అబ్రహం వర్గీయులు, కార్యకర్తలతో ఎమ్మెల్సీ సమావేశమై మాట్లాడారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిని కలిసికట్టుగా గెలిపించుకొని అలంపూర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. తొమ్మిదేళ్లలో దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి తెలంగాణలో చూశామన్నారు. పట్టణ నేతలు పలు అంశాలను ఎమ్మెల్సీకి వివరించగా ఎన్నికల అనంతరం సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. వ్యాపారస్తులు, రియల్ ఎస్టేట్ ఏజెంట్లను బెదిరింపులకు గురిచేస్తూ వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తులను వదిలిపెట్టమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, సింగిల్‌విండో డైరెక్టర్లు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

### బొంకూరులో..

ఉండవెల్లి; నవంబర్ 11 : మండలంలోని బొంకూరులో ఎమ్మెల్సీ చల్లా పర్యటించి బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయుడి గెలుపునకు సహకరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలతాభాస్కర్‌రెడ్డి, నాయకులున్నారు.


సమావేశానికి హాజరైన కార్యకర్తలు


అయిజ: కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి